సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 25 । సెప్టెంబర్ । 2024



కొనసాగుతున్న దళితుల నిరసనలు

అంబేడ్కర్ ఫ్లెక్సీని చించి అవమానించిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలంటూ చేస్తున్న ఆందోళనలు మంగళవారం కూడా కొనసాగాయి. 8లో▸



పక్షుల కేంద్రం.. కళా విహీనం

పక్షి ప్రేమికుల స్వర్గధామమైన ఆటపాక పక్షుల కేంద్రం వరద నీటిలో నానుతోంది. ఈ నెల ప్రారంభం నుంచి ముంపు బారిన పడగా.. ఇప్పటికీ వరద తగ్గలేదు. 8లో▸



చోరీ కేసును ఛేదించిన పోలీసులు

ఏలూరు జిల్లా నూజివీడులోని ఒక ఇంట్లో 21 కాసుల బంగారం, 8 కిలోల వెండి వస్తువులు, నగదు దోచుకున్న కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. 8లో▸

పదవుల పంచాయితీ

- సీట్లు త్యాగం చేసినవారికి మొండిచేయి
- జనసేనకు దక్కని పదవులు
- గన్నికి పరాభవం.. ముద్దరబోయినకు అన్యాయం
- అనేక నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి
- పీతలసు జాతకు ప్రాధాన్యత లేని నామినేటెడ్ పదవి





పీతల సుజాత, మాజీ మంత్రి



బొరగం శ్రీనివాస్, పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి



మంతెన రామరాజు, ఉండి మాజీ ఎమ్మెల్యే



తోట సీతారామలక్ష్మి పశ్చిమ టీడీపీ అధ్యక్షురాలు



గన్ని వీరాంజనేయులు ఏలూరు టీడీపీ అధ్యక్షుడు



వలవల బాబ్జీ, తాడేపల్లిగూడెం టీడీపీ నేత



ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే

సాక్షి ప్రతినిధి, ఏలూరు: కూటమిలో నామినేట్ పంచాయతీ షురూ అయింది. ఉమ్మడి పశ్చిమకు మూడే పదవులు దక్కడం, అవీ ప్రాధాన్యత లేనివి కావడంతో అసంతృప్తులు ఆగ్రహంతో ఉన్నారు. పొత్తుల్లో భాగం సీట్లు త్యాగం చేసిన వారికి పూర్తిగా మొండిచేయి చూపించడంతో అధికార పార్టీలో రగడ తారాస్థాయికి చేరింది. మూడు నెలలుగా రేపు, మాపంటూ అందరిని ఊరించి ఐవీఆర్ఎస్ సర్వే, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇన్‌చార్జ్ మంత్రుల సిఫార్సులు, పార్టీ కోసం కష్టపడిన వారికి తొలి ప్రాధాన్యమంటూ ప్రకటనలు గుప్పించి చివరకు తుస్సుమనిపించారు. ఉమ్మడి పశ్చిమలో పదుల సంఖ్యలో ముఖ్య నేతలకు ప్రాధాన్యతమిస్తామని హామీలు గుప్పించి అందరికీ హ్యాండ్ ఇచ్చారు. మూడు పదవులు ఉమ్మడి జిల్లాకు దక్కాయి. అవి కూడా ప్రాధాన్యత పదవులు కావడం విశేషం.

ఆరుగురు టికెట్లు త్యాగం చేస్తే.. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు నామినేట్ పదవుల్లో ప్రాధాన్యత లభించలేదు. 15 నియోజకవర్గాలకు గాను ఉమ్మడి జిల్లాలో ఆరుగురు టీడీపీ ఇన్‌చార్జులు టిక్కెట్లను జనసేనకు త్యాగం చేశారు. ఆరుగురికి ఎమ్మెల్సీ ఇస్తామని లేదంటే టీడీపీ అధికారంలోకి రాగానే సముచిత స్థానంతో గౌరవిస్తామని ప్రతి ఎన్నికల సభలో, ప్రతి నియోజకవర్గంలో చంద్రబాబు మొదలుకొని పవన్ కల్యాణ్ వరకు అందరూ పదే పదే చెప్పారు. కూటమిలోని పార్టీలకు కష్టపడి పనిచేసిన ఏ ఒక్కరికీ అన్యాయం జరగదని ప్రకటించి చివరికి అన్యాయం చేశారు. మూడు నెలలుగా ఊరించి మంగళవారం 20 కార్పొరేషన్లకు చైర్మన్లను, కొన్నింటికి సభ్యులను ప్రకటించారు. నేతల గతానుభవం, స్థాయికి దక్క పదవులు రాలేదని, పదవులు పొందిన వారు అసంతృప్తితో రగిలిపోతుండగా, సీట్లు త్యాగం చేసి కోట్లు ఖర్చు పెట్టి, ఏళ్ల తరబడి పార్టీని పోషిస్తే కనీసం నామినేట్ పదవులకు తమ పేర్లను పరిగణనలోకి తీసుకోలేదని మరికొందరు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. కూటమిలో కీలకంగా ఉన్న జనసేన, ఒక్కే ఒక్క స్థానంలో పోటీ చేసిన బీజేపీకి ఒక్క పదవి దక్కకపోవడంతో నేతల్లో నిరుత్సాహం మొదలైంది.

ముచ్చటగా మూడే పదవులు

జిల్లాకు ముచ్చటగా మూడే కార్పొరేషన్ పదవులు దక్కాయి.అవి కూడా రెండు ప్రాధాన్యత లేని నామినేటెడ్ కావడంతో పదవులు దక్కించుకున్న నాయకుల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. మాజీ మంత్రి పీతల సుజాత ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పదవికోసం తీవ్రంగా లాబీయింగ్ చేస్తే చివరికి వినియోగదారుల రక్షణ మండలి చైర్మన్‌గా ఎవరికీ తెలియని పదవిలో నియమించారు. పోలవరం టీడీపీ నేత బొరగం శ్రీనివాస్ ఎమ్మెల్సీపై ఆశలు పెట్టుకుంటే చివరికి ఏపీ ట్రికార్ (షెడ్యూల్ తెగల సహకార ఆర్థిక సంస్థ) చైర్మన్ గా నియమించారు. రఘురామకృష్ణంరాజు కోసం టికెట్ త్యాగం చేసిన మంతెన రామరాజు అప్పడా కోసం పైరవీలు చేస్తే ఏపీఐఐసీ చైర్మన్‌గా నియమించారు. కైకలూరు నియోజకవర్గానికి చెందిన కొడాలి వినోద్ కుమార్‌ను టూరిజం డెవలప్‌మెంట్ బోర్డు సభ్యుడిగా నియమించారు.

జిల్లా ఇన్‌చార్జిలకు మొండిచేయి

టికెట్ త్యాగం చేసినవారికి మొండిచేయి చూపడంపై తీవ్ర చర్చ సాగుతుంది. ఉమ్మడి పశ్చిమలో అత్యధికంగా ఆరు సీట్లు జనసేనకు కేటాయించిన క్రమంలో అక్కడ ఇన్‌చార్జులకు ఎమ్మెల్సీగాని, నామినేట్ పదవులుగాని ఇస్తామని హామీ ఇచ్చారు. అన్ని నియోజకవర్గాల్లో ఐవీఆర్ఎస్ సర్వేలు నిర్వహించి హడావుడి చేశారు. చివరికి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా పార్టీ అధ్యక్షులకే దిక్కులేకుండా పోయింది. ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుకు కాకుండా పొత్తులో భాగంగా జనసేనకు ఉంగుటూరు టికెట్ కేటాయించడంతో తొలుత హడావుడి చేసినా.. నామినేటెడ్ పదవి హామీతో సైలెంట్ అయిపోయారు. ఇప్పుడు అతనికి మొండిచేయి చూపారు. పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ తోట సీతామహాలక్ష్మి, తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి వలవల బాబ్జి, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, ఉండి ఇన్‌చార్జి రామరాజు, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడుకు తప్పనిసరిగా ప్రాధాన్యతనిస్తామని హామీ ఇచ్చారు. కాని ఎవర్ని పట్టించుకున్న దాఖలు లేవు. ప్రస్తుత ఏలూరు జిల్లా నూజివీడులో ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, కైకలూరు మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌కు కూడా భారీ హామీలే ఇచ్చారు. సామాజిక సమీకరణాలు, సర్దుబాట్లు, ఇతర కారణాలు చెప్పి కనీసం పరిగణనలోనికి కూడా తీసుకోలేదు.

జగనే మన ధైర్యం

అప్పడా మాజీ వైస్ చైర్మన్ వడ్డి రఘురాం



సమావేశంలో మాట్లాడుతున్న అప్పడా మాజీ వైస్ చైర్మన్ వడ్డి రఘురాం

తాడేపల్లిగూడెం: జగనే మన ధైర్యం, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలు మనకే పట్టం కడతారని అప్పడా మాజీ వైస్ చైర్మన్ , వైఎస్సార్‌సీపీ నేత వడ్డి రఘురాం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు మంగళవారం ఆయన నివాసంలో రఘురామ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జగన్‌పై విశ్వాసం, అభిమానంతో మొదటి నుంచి పార్టీ మోసిన కార్యకర్తలకు ధైర్యం ఇవ్వడానికి మాత్రమే పనిచేస్తున్నానన్నారు. పార్టీకి సేవ చేయడానికి , కార్యకర్తలకు ధైర్యం చెప్పడానికి ఉన్నానన్నారు. పార్టీకి కార్యకర్తలు ముఖ్యం. ఎన్నికలు ఎప్పుడు జరిగినా అధికారం వైఎస్సార్‌సీపీదే అని అన్నారు. పెద్ద ఎత్తున యువత వైఎస్సార్‌సీపీ వెంట ఉందని చెప్పారు. కార్యకర్తలకు ధైర్యం చెప్పడానికి తాను పనిచేస్తున్నానని, జగన్ ఆదేశాలే శిరోధార్యం అన్నారు. కార్యకర్తలు పార్టీకి అంకితం కావాలన్నారు. వెంకట్రావుపాలెం, కుంచనపల్లి, మెట్ట ఉప్పరగూడెం, పెంటపాడు, దర్శిపర్రు గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు రఘురాంను కలిశారు. తాడేపల్లిగూడెం ఎంపీపీ పి.శేషులత, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, కొప్పుల వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఉద్యోగ భద్రత కల్పించాలి



మహదేవపట్నం మద్యం డిపో సిఐ పద్మజకు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

భీమవరం/ఉండి: ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలంటూ మంగళవారం చలో ప్రభుత్వ మద్యం డిపో నినాదంతో భీమవరం సమీపంలోని మహదేవపట్నంలోని ప్రభుత్వ మద్యం డిపో వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజ్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా నాయకులు తాడి శివకుమార్, దుర్గారావు మాట్లాడుతూ నూతన మద్యం పాలసీ కారణంగా ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేసే ఉద్యోగులకు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాలసీ మారుతున్నందున షాపుల్లో పనిచేసే సిబ్బందికి వేరే డిపార్ట్‌మెంట్లలో ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. అనంతరం మద్యం డిపో సీఐ పద్మజకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో క్రాంతి, ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

27న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

భీమవరం: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈనెల 27న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమవరం ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో బి.సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం జరిగే విద్యుత్ వినియోగదారుల సదస్సులో అర్జీలను అందచేయవచ్చన్నారు.

రైతు ఆదాయం పెంచడమే ధ్యేయం



కరుగోరుమిల్లిలో పొలం పిలుస్తోందిలో పాల్గొన్న కేంద్ర మంత్రి వర్మ, ఎమ్మెల్యే పితాని

పెనుగొండ: రైతుల ఆదాయం పెంచడమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని కేంద్ర మంత్రి బి.శ్రీనివాసవర్మ అన్నారు. ఆచంట మండలం కరుగోరుమిల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని శిక్షణను ప్రారంభించారు. డ్రోన్ పనితీరును పరిశీలించారు. నానాటికీ పెరగుతున్న సాగు ఖర్చును తగ్గించడానికి పొలం పిలుస్తోంది వంటి కార్యక్రమాల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆదుకుంటామన్నారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమన్నారు. వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి పాల్గొన్నారు.

పశ్చిమ గోదావరి విద్యుత్ ఎస్ఈగా రఘునాథబాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పశ్చిమ గోదావరి విద్యుత్ సర్కిల్‌కు ఎస్ఈగా ఏ.రఘునాథ బాబు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన విశాఖపట్నంలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో ప్రాజెక్ట్స్ విభాగం జనరల్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. రఘునాథబాబు గతంలో ఏలూరు సర్కిల్ పరిధిలో పలు విభాగాల్లో పని చేశారు.

ఆర్వోబీ నిర్మాణానికి స్థలం పరిశీలన



ఉంగుటూరులో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థలం పరిశీలిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఏలూరు జిల్లాలో ఆరు చోట్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) నిర్మాణాలకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు రైల్వే అధికారులు ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఓవరు బ్రిడ్జి నిర్మాణాల సాధ్యాసాధ్యాలు పరిశీలించారు. ఉంగుటూరు, కైకరం, భీమడోలు, పూళ్ల, సీతంపేట, ఏలూరు పవర్‌పేట ప్రాంతాలలో రైల్వే గేట్లు ఉన్న చోట ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్నారు. రైల్వే శాఖనే పూర్తిగా బ్రిడ్జి నిర్మించే యోచన చేస్తోంది. ప్రజలకు ఇబ్బంది లేకుండా బ్రిడ్జిలు నిర్మిస్తే బాగుంటుందని ఏలూరు ఆర్డీవో ఖాజావలీ రైల్వే అధికారులకు సూచించారు.

మంచి అలవాట్లు నేర్చుకోవాలి



తణుకులో 2కె రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు టౌన్/తణుకు అర్బన్: విద్యార్థులు చదువుతో పాటు స్వచ్ఛతా హీ సేవ వంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. మంగళవారం తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద జరిగిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో 2కె రన్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లను నేర్చుకోవాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి మున్సిపల్ కార్యాలయం వరకూ నిర్వహించిన ఈ రన్‌లో సుమారు 6 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఇన్‌చార్జ్ ఆర్డీవో బి.శివన్నారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ టీ రామ్‌కుమార్, తహసిల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ తదితరులు పాల్గొన్నారు. 2కె రన్ విజేతలు బి.సుభాష్ (ప్రథమ), ఎం.హిమేష్ (ద్వితీయ), ఏ లక్ష్మీనారాయణ (తృతీయ)కు బహుమతులు అందజేశారు. పారిశుద్ధ్య కార్మికుల కోసం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. పారిశుద్ధ్య కార్మికులకు చర్మవ్యాధులతోపాటు ఇతర రుగ్మతలు వచ్చే అవకాశం ఉందని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ సూర్యనారాయణ, డీఎంహెచ్‌వో ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరుపాడులో 144 సెక్షన్



ఏలూరుపాడు వంతెన వద్ద పోలీస్ పికెట్

కాళ్ళ: కాళ్ళ మండలం ఏలూరుపాడులో మంగళవారం నుంచి 14 రోజుల పాటు 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు కాళ్ళ ఎస్సై శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగార్జున తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆకివీడు రూరల్ సీఐ ఆధ్వర్యంలో 144 సెక్షన్ అమలు చేయబోతున్నట్లు తెలిపారు. గ్రామంలో ఐదుగురు కంటే ఎక్కువగా ఎక్కడా గుంపులుగా ఉండకూడదని తెలిపారు. సభలు సమావేశాలు నిర్వహించకూడదన్నారు.

క్షేత్ర అభివృద్ధికి త్రినాథరావు కృషి




ఈఓ వేండ్ర త్రినాథరావు దంపతులను సత్కరిస్తున్న ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు

ద్వారకాతిరుమల: క్షేత్ర అభివృద్ధికి ఈఓ వేండ్ర త్రినాథరావు ఏ విధంగా పాటుపడ్డారో.. అదే స్ఫూర్తితో పనిచేయాలని నూతన ఈఓ ఎస్‌వీఎస్ఎన్ మూర్తిని శ్రీవారి దేవస్థానం చైర్మన్ ఎస్వీ సుధాకరరావు కోరారు. చినవెంకన్న దేవస్థానం నుంచి సింహాచలం దేవస్థానానికి బదిలీ అయిన ఈఓ త్రినాథరావుకు అభినందన సభ, కొత్త ఈఓకు స్వాగత కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా అర్చకులు, పండితులు ఈఓ త్రినాథరావు దంపతులకు వేద ఆశీర్వచనాన్ని పలికారు. సభలో సుధాకరరావు మాట్లాడుతూ క్షేత్ర అభివృద్ధికి ఈఓ త్రినాథరావు ఎంతో కృషి చేశారన్నారు. త్వరలో శ్రీవారికి బంగారు రథం, విమాన గోపురానికి బంగారు తాపడం చేయిస్తామన్నారు. దాత పీపీ రాజు సహకారంతో నిర్మిస్తున్న సహస్ర దీపాలంకరణ సేవ మండపాన్ని అతి త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఈఓ త్రినాథరావు మాట్లాడుతూ సింహాచలం దేవస్థానంలో నాలుగోసారి పనిచేసే అవకాశం దక్కిందన్నారు. తన హయాంలో ద్వారకాతిరుమల క్షేత్రంలో జరిగిన అభివృద్ధిని మరిచిపోలేనన్నారు. తాను మొదట్లో ఇక్కడ పనిచేసినప్పుడు 17 నుంచి 18 వందల మందికి మాత్రమే ఉచిత అన్నప్రసాదాన్ని అందించే వాళ్లమని, ఇప్పుడు ఆ సంఖ్య 10 వేలకు దాటిందన్నారు. నూతన ఈఓ మూర్తి మాట్లాడుతూ ఉద్యోగుల సహకారంతో క్షేత్రాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

సొంతింటి ఆశలపై నీళ్లు

- మార్చి నాటికి పూర్తికాకుంటే ఇబ్బందులే
- జిల్లాలో 73,792 ఇళ్ల మంజూరు
- ఇంతవరకూ పూర్తయిన ఇళ్లు 31,059



భీమవరం పట్టంలోని విస్సాకోడేరు లే అవుట్‌లో పూర్తయిన ఇళ్లు



విస్సాకోడేరు లే అవుట్‌లో వివిధ దశల్లో ఉన్న ఇళ్లు

భీమవరం: సొంతింటి కల నెరవేరుతుందని ఎంతో ఆశతో ఉన్న జగనన్న కాలనీల్లోని లబ్ధిదారులు పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఇళ్లు వచ్చే ఏడాది మార్చినెలాఖరులోపుగా పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం షరతులు విధించడంతో లబ్ధిదారుల గుండెల్లో గుబులు పట్టుకుంది. జిల్లా వ్యాప్తంగా 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 2021లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో సుమారు 630 లేఅవుట్లను ఏర్పాటుచేసి 73,792 మందికి ఇళ్లు మంజూరు చేశారు. లబ్ధిదారుల ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల సాయంతో పాటు డ్వాక్రా మహిళలకు రూ.35 వేలు బ్యాంకు రుణం ఇప్పించేలా ఏర్పాటుచేశారు. ప్రభుత్వ సాయంతోపాటు లబ్ధిదారులు మరికొంత నగదు సమకూర్చుకుంటే ఇంటిని నిర్మించేలా ప్రణాళికలు తయారుచేశారు. దీంతో వేలాది మంది ఇళ్ల నిర్మాణం చేపట్టగా దాదాపు 31 వేల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది. మిగిలిన వాటిలో కొన్ని అనేక దశల్లో ఉండగా మరికొంతమంది అసలు పనులు ప్రారంభించనేలేదు. అప్పటి ప్రభుత్వం ఇళ్లస్థలాలు కేటాయించినప్పటి నుంచి ఎక్కువగా వర్షాలు కురువడంతో లేఅవుట్స్ పూడికకు ఇబ్బంది ఏర్పడగా భీమవరం వంటి ప్రాంతాల్లో పూడికకు మట్టి కొరతతో తీవ్ర జాప్యం జరిగింది.

కాలనీల్లో అన్ని సౌకర్యాల కల్పన

జగనన్న ఇళ్ల కాలనీల్లో అనేకచోట్ల మంచినీరు, విద్యుత్ సదుపాయం కల్పించారు. పెద్ద కాలనీల వద్ద ప్రత్యేక విద్యుత్ సబ్‌స్టేషన్లు కూడా ఏర్పాటుచేశారు. రోడ్ల సౌకర్యం కల్పించాల్సిన సమయంలో ప్రభుత్వం మారిపోవడంతో ఇళ్ల నిర్మాణంపై నీలినీడలు అలుముకున్నాయి.

నిర్మాణంలో ఉన్న ఇళ్లు మాత్రమే పూర్తి చేయాలి

గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు తన హయాంలో ఎక్కడా ఇంటి స్థలం ఇవ్వకపోయినా గత ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం అనేక ఆంక్షలు విధించింది. తమ ప్రభుత్వం పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు స్థలం కేటాయించడమేగాక ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని ప్రకటించారు. దీంతో అనేకమంది లబ్ధిదారులు సొంతింటిపై ఆశలు పెంచుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి మూడు నెలలైనా గడవముందే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలంటే భయమేస్తుందంటూ ప్రకటించడంతో ఇళ్ల నిర్మాణంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

జిల్లా వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణం

మండలం	మంజూరైనవి	పూర్తయినవి	పెండింగ్‌లో
భీమవరం పట్టణం	7,297	465	6,832
భీమవరంరూరల్	1,969	1,235	734
ఆకివీడు రూరల్	2,199	785	1,414
ఆకివీడు టౌన్	1,233	408	825
అత్తిలి	2,595	1,063	1,345
తాడేపల్లిగూడెం	3,826	1,570	2,256
తాడేపల్లిగూడెంరూరల్	3,820	2,117	1,703
పెంటపాడు	2,446	1,468	978
వీరవాసరం	1,758	913	845
గణపవరం	1,663	1,070	593
ఉండి	3,040	1,505	1,535
కాళ్ల	1,265	924	341
పాలకొల్లు అర్బన్	1,101	456	645
పాలకొల్లు రూరల్	1,310	942	368
నరసాపురం రూరల్	2,778	1,023	1,755
నరసాపురం టౌన్	2,811	755	2,056
యలమంచిలి	2,478	1,520	958
ఆచంట	2,741	1,423	1,318
తణుకు టౌన్	6,383	1,275	5,108
తణుకు రూరల్	4,075	1,545	2,530
పెనుమంట్ర	3,243	1,551	1,692
పోడూరు	2,978	1,494	1,484
పెనుగొండ	3,593	1,506	2,087
మొగల్తూరు	2,289	1,439	850
ఇరగవరం	2,503	1,503	1,000

విద్యుత్ సంస్థ ఈఈ, డిప్యూటీ ఈఈల బదిలీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను బదిలీ చేస్తూ ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలోని పలువురు ఈఈలు, డిప్యూటీ ఈఈలకు స్థాన చలనం కలిగింది. ఏలూరు ఈఈ టెక్నికల్‌గా పని చేస్తున్న ఎం.యూనుస్‌ని పశ్చిమ గోదావరి జిల్లా ఈఈ టెక్నికల్‌గా, రాజమహేంద్రవరం ఈఈ డీపీఈగా పని చేస్తున్న కేఎం. అంబేద్కర్‌ను ఏలూరు ఆపరేషన్ ఈఈగా బదిలీ చేశారు. తాడేపల్లిగూడెం ఆపరేషన్స్ ఈఈగా పని చేస్తున్న ఎస్.వెంకటేశ్వరరావును పశ్చిమ గోదావరి ఆపరేషన్స్ ఈఈగా, భీమవరం ఆపరేషన్స్ ఈఈగా పని చేస్తున్న పీర్ అహ్మద్ ఖాన్‌ను ఏలూరు ఈఈ టెక్నికల్‌గా, విజయవాడ ఈఈ ఎస్ఎల్‌డీసీగా పని చేస్తున్న నరసింహమూర్తిని తాడేపల్లిగూడెం ఆపరేషన్స్ ఈఈగా, తాడేపల్లిగూడెం ఎం అండ్ పీ ఈఈగా పని చేస్తున్న బీ.రఘును పశ్చిమ గోదావరి జిల్లా ఎంఆర్‌టీ ఈఈగా బదిలీ చేశారు. కామవరపుకోట సీ అండ్ ఓ డిప్యూటీ ఈఈగా పని చేస్తున్న కాసాని శ్రీనివాసరావుకు పదోన్నతి కల్పించి ఏలూరు ఎంఆర్‌టీ ఈఈగా బదిలీ చేశారు. అలాగే పలువురు డిప్యూటీ ఈఈలను బదిలీ చేశారు.

రఘురామను అరెస్ట్ చేయాలి

- కొనసాగుతున్న దళితుల నిరసనలు
- అంబేడ్కర్‌ను అవమానించడంపై మండిపాటు
- ప్రభుత్వం స్పందించాలని డిమాండ్



తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెంలో దళిత నాయకుల నిరసన

బుట్టాయగూడెం: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చించి అవమానించిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై చర్యలు తీసుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా చేస్తున్న ఆందోళనలు మంగళవారం కూడా కొనసాగాయి. ఆర్ఆర్ఆర్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలంటూ దళితులు మండిపడుతున్నారు. బుట్టాయగూడెం అంబేడ్కర్ నగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్, వార్డ్‌మెంబర్ కోరం దుర్గారావు మాట్లాడుతూ రఘురామకృష్ణరాజు అంబేద్కర్ ఫ్లెక్సీని చించి అవమానించి దళితుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించారని అన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఎమ్మెల్యే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని, లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు బేతాళ డేవిడ్ రాజు, కె. రాజు, కోండ్రు కార్తిక్, కాంగ్రెస్ నాయకులు అమర్తాల ఏసుపాదం, కోండ్రు ఆనంద్, టి.శామ్యూల్, బి.పేతురు పాల్గొన్నారు.

రెండోరోజూ గృహనిర్బంధమే

పెనుగొండ: రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ గృహనిర్బంధం మంగళవారం రెండో రోజూ కొనసాగింది. ఏలూరుపాడులో ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహేబ్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపివేయడంపై నిరసన తెలిపేందుకు వెళుతుండగా అదుపులోకి తీసుకొని రెండురోజులుగా ఆచంట వేమవరంలో గృహనిర్బంధంలో ఉంచారు. దీంతో పుష్పరాజ్ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుచేసిన ఆర్ఆర్ఆర్‌ను అరెస్ట్ చేయకుండా కాలయాపన చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ నాయకులను గృహనిర్బంధం చేయడం సిగ్గు చేటన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లాటి ప్రసాదరావు, తరపట్ల జోషి పాల్గొన్నారు.

దేశద్రోహం కేసు నమోదు చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు. దళిత నాయకులు మంగళవారం తాడేపల్లిగూడెం పట్టణంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఒక ప్రజాప్రతినిధిగా ఉంటూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపి అవమానించడం దారుణం అని అన్నారు. అనంతరం తాడేపల్లిగూడెం డివిజన్ డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో గుంపుల సత్యకృష్ణ, అచ్చిబాబు, కె.లక్ష్మణరావు, ఉన్నమట్ల ఏసురత్నం, కృష్ణంరాజు, మహేష్, నందిరాజు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

యువకుల ఆందోళన

ఉంగుటూరు: మండలంలోని చేబ్రోలులో మంగళవారం యువకులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. చేబ్రోలు, అప్పారావుపేట, గోపినాధపట్నం, గొల్లగూడెం , నారాయణపురంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై కేసునమోదు చేయాలని కోరారు. దళిత యువకులు ఈపిచర్ల నాగరాజు, కొమ్మిన నాగేశ్వరరావు, గాలి శ్రీనివాసరావు, కె.నాగేంద్ర బాబు, జె.మాణికాయలరావు, తోట వెంకటేశ్వరరావు, గొమ్మిన లోవరాజు, భానుప్రకాష్, బొడిగడ్ల చందు, కొమ్మిన పండు, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు ఆపాలి

కామవరపుకోట: కూటమి ప్రభుత్వం దళితులపై చేస్తున్న దాడులు ఆపాలని ఏలూరు జిల్లా ఎస్సీ ఎస్టీ కేసుల విజిలెన్స్, మోనిటరింగ్ కమిటీ సభ్యులు గుర్రాల రవికుమార్ మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు డా.బాబా సాహెబ్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చించివేయడం చాలా దుర్మార్గం అని అన్నారు. కాకినాడ ఎమ్మెల్యే పంతం నానాజి కాకినాడలో వైద్య కళాశాలలోని దళిత అధికారిపై అసభ్యకరమైన బూతులు తిట్టడం హేయమైన చర్యని అన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దళితులను వేధించడానికి ఉపయోగిస్తే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.


పెనుగొండ: ఆచంట వేమవరంలో రెండోరోజూ గృహనిర్బంధంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పుష్పరాజ్


బుట్టాయగూడెం: అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహిస్తున్న దళిత సంఘాల నాయకులు


ఉంగుటూరు: చేబ్రోలులో ర్యాలీ నిర్వహిస్తున్న దళిత యువకులు

క్లుప్తంగా

ప్రమాదవశాత్తూ చెరువులో పడి..


యాదాల దేశాలు మృతదేహం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రమాదవశాత్తు ఊర చెరువులో పడి ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన యాదాల దేశాలు గేదెను స్థానిక ఊర చెరువులో కడిగేందుకు తీసుకెళ్లగా ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోయాడు. స్థానికుల సహకారంతో అతడిని బయటకు తీయగా అప్పటికే అతడు మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని రూరల్ పోలీసులు పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దేశాలు తండ్రి సంతోషం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా, దేశాలుకు భార్య సునీత, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల కోసం వైద్య శిబిరాలు

భీమవరం(ప్రకాశంచౌక్): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల కోసం మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామని తెలిపారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో భాగంగా సోమ, మంగళవారాల్లో జిల్లా వ్యాప్తంగా ఏడు వైద్య శిబిరాలను నిర్వహించి 1,074 మంది పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలను నిర్వహించామని చెప్పారు.

క్షేత్ర పరిశీలనతోనే సమస్యల పరిష్కారం

ఆకివీడు: ఆక్వా, నాన్ ఆక్వా జోన్ పరిధిలోని చేపల చెరువులు, రొయ్యల చెరువుల యజమానులు తమ పేర్లను అప్సడా కేంద్రం వద్ద లేదా మత్స్యశాఖ మండల కార్యాలయం వద్దగాని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మత్స్యశాఖ జిల్లా అధికారి ఆర్‌పీఎస్ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. స్థానిక ఏడీఏ కార్యాలయం వద్ద రైతు సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సబ్సిడీలు, ఇతర సదుపాయాలు పొందేందుకు తప్పనిసరిగా చెరువుల యజమానులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఆక్వా జోన్ సరిహద్దుల్లో పొలాలుంటే నిబంధనల మేరకు చెరువులు తవ్వాలని, ఆ విధంగా తవ్వని చెరువుల్ని ధ్వంసం చేస్తామన్నారు. ఎంపీపీ కఠారి జయలక్ష్మి మాట్లాడుతూ ముంపు వల్ల మండలంలో వేలాది ఎకరాల పంట నష్టం వాటిల్లిందన్నారు. అన్ని గ్రామాల్లోనూ వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.10 వేలు నష్టపరిహారం ముంపు తిప్పల్ని తొలగించడానికి సరిపోదన్నారు. మండల వ్యవసాయాధికారిణి ప్రియాంక పాల్గొన్నారు.

అండర్ 19 రగ్బీ జిల్లా జట్ల ఎంపిక


ఎంపికైన బాలురు, బాలికల జట్లు

పెదవేగి : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్ 19 బాలురు, బాలికల రగ్బీ జిల్లా జట్ల ఎంపికలు మంగళవారం పెదవేగి సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల్లో జరిగాయి. ఈ ఎంపిక పోటీలకు జిల్లా నుంచి సుమారు 76 మంది క్రీడాకారులు పాల్గొనగా ఇందులో ఉత్తమ నైపుణ్యం కనబరిచిన 12 మంది బాలికలు, 12 మంది బాలురను జిల్లా జట్లకు ఎంపిక చేసినట్లు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కె జయరాజు చెప్పారు. బాలికలు జట్టు అక్టోబర్ 2, 3 తేదీల్లో కర్నూల్‌లో, బాలురు 5, 6 తేదీల్లో ఏలూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపికలో గురుకుల ప్రిన్సిపాల్ ఎం వెంకటేశ్వరరావు, రగ్బీ అసోసియేషన్ సభ్యులు ఎం అచ్చుతరావు , పీడీలు, కె శ్రీనివాసరావు, కె శ్రీనివాసరావు, పీఈటీలు గురుమూర్తి, యువరాజు, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

పసికందుకు చికున్ గున్యా


వైద్యం పొంది కోలుకున్న బాలుడు

ఆకివీడు: రెండు వారాల పసికందుకు చికున్ గున్యా సోకగా ఆకివీడులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్నాడు. మండలంలోని కుప్పనపూడికి చెందిన నాగ సరస్వతికి ఈ నెల 5న చిన్నారి జన్మించాడు. పుట్టుకతోనే అస్వస్థతగా ఉండడంతో స్థానిక శ్రీ రామరాజు ఆసుపత్రిలో చేర్చగా వైద్యుడు కలిదిండి మహేష్ వర్మ వైద్యం అందజేశారు. రక్త నమూనాలు ఢిల్లీకి పంపగా అక్కడ చికున్ గున్యా వైరస్‌గా గుర్తించారు. సంబంధిత వైద్యం అందజేయడంతో పసికందు త్వరగా కోలుకున్నాడని మహేష్ వర్మ చెప్పారు. ఇలా 58 వేల మందిలో ఒకరికి వచ్చే అవకాశం ఉందన్నారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు



ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ కేపీ శివకిషోర్


పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

- భారీగా చోరీ సొత్తు స్వాధీనం
- దొంగలను పట్టుకున్న నూజివీడు పోలీస్
- ఏలూరు జిల్లా ఎస్పీ శివకిషోర్ వివరాలు వెల్లడి

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా నూజివీడు పట్టణంలో ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోని బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు నగదును దోచుకువెళ్లిన దొంగలను నూజివీడు పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి భారీగా చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును కేవలం 72 గంటల వ్యవధిలోనే పోలీసులు ఛేదించారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. ఈనెల 19న నూజివీడు పట్టణం ఎంప్లాయిస్ కాలనీలో నివాసం ఉంటోన్న వల్లభనేని రామకృష్ణ, కాశీ లక్ష్మి అన్నపూర్ణ ఇంట్లో చోరీ జరిగింది. ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోని బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదును దొంగలు అపహరించారు. 21 కాసులకుపైగా బంగారం, 8కిలోల వెండి వస్తువులు, రూ.45వేల నగదును దోచుకువెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఏలూరు జిల్లా ఎస్పీ కేపీ శివకిషోర్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నూజివీడు టౌన్ సీఐ పీ.సత్యశ్రీనివాస్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేశారు. నూజివీడు పట్టణంలోని గాంధీ సెంటర్‌లో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా దెందులూరు మండలం గోపన్నపాలెం మసీదుపాడు గ్రామానికి చెందిన గురువెందుల వెంకటరమణ, బొంతు నరేంద్ర మోటారు సైకిల్‌పై అనుమానాస్పదంగా సంచరిస్తూ ఉండడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. వీరివద్ద నుంచి 21.1/4 కాసుల బంగారు ఆభరణాలు, 8 కిలోల వెండి వస్తువులు, రూ.20 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రతిభతో కేసును ఛేదించిన నూజివీడు సీఐ పీ.సత్యశ్రీనివాస్, ఏఎస్ఐ ఖాసీం బేగ్, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

● గూడెంలో దంచికొట్టిన వాన


ఏరియా ప్రభుత్వాసుపత్రికి వెళ్లే రహదారిలో వర్షం నీరు


మునిసిపల్ కార్యాలయం వద్ద జలమయం

తాడేపల్లిగూడెం, రూరల్: తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సుమారు గంటసేపు ఏకధాటిగా కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. ప్రధానంగా గూడెం బస్టాండ్ ప్రాంతం, ఓవర్‌బ్రిడ్జి నుండి పాతూరు వెళ్లేదారి, పెద్దమసీదు ప్రాంతం, గుణ్ణం ఫంక్షన్‌హాలు ప్రాంతం, మహాలక్ష్మినగర్, ప్రభుత్వాసుపత్రి, వీకర్స్ కాలనీ రహదారులు నీట మునిగాయి. అలాగే ఎల్.అగ్రహారం, ఇటుకులగుంట, దండగర్ర, ఆరుగొలను గ్రామాల్లోనూ వర్షం కురిసింది. డ్రెయిన్లలోని మురుగునీరు రోడ్లపై నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.


వీకర్స్ కాలనీలో ఇలా...

హాస్టల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలి

ఎన్‌హెచ్‌ఆర్‌సీ (తాత్కాలిక) చైర్‌పర్సన్ విజయభారతి సయానీ


అంతర్వేదిగూడెం పాఠశాలను సందర్శించిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ (తాత్కాలిక) చైర్‌పర్సన్ విజయభారతి సయానీ

బుట్టాయగూడెం: గిరిజన వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు తప్పనిసరిగా మెనూ ప్రకారం భోజనం అందించేలా ఉపాధ్యాయులు, వార్డెన్‌లు తగు చర్యలు తీసుకోవాలని జాతీయ మానవహక్కుల కమిషన్(తాత్కాలిక) చైర్‌పర్సన్ విజయభారతి సయానీ అన్నారు. బుట్టాయగూడెం మండలం మారుమూల గ్రామమైన అంతర్వేదిగూడెంలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వసతిగృహాన్ని మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారికి అందజేస్తున్న భోజన మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థుల ఆరోగ్యం పట్ల తీసుకుంటున్న చర్యలపై కూడా ఆరా తీశారు. అనంతరం పాఠశాలలోని ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలలు పరిశుభ్రంగా ఉండేవిధంగా చూడాలని, మెనూ సక్రమంగా అమలు చేయాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పాఠశాల వసతిగృహాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే విద్యార్థుల డార్మెంటరీల వద్ద ఉండే కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం 9, 10 తరగతుల విద్యార్థులతో కూడా చైర్‌పర్సన్ మాట్లాడారు. విద్య ద్వారానే పేదరిక నిర్మూలన జరుగుతుందని, ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి ఉన్నత విద్యలో ముందుకుసాగాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ కె.శిరమయ్య, ఏటీడబ్ల్యూఓ శ్రీవిద్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందుల ప్రకాష్, ఉపాధ్యాయులు, స్థానిక ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు, పాల్గొన్నారు.

పక్షుల కేంద్రం.. కళా విహీనం

- ఇంకా తగ్గని వరద నీరు
- తిలకించడానికి వచ్చి వెనుదిరుగుతున్న పర్యాటకులు
- పక్షుల కేంద్రం గట్లు పెంచాలని డిమాండ్


వరదల కారణంగా ఆటపాక పక్షుల కేంద్రం మ్యూజియం నీటితో నిండిన దృశ్యం

కైకలూరు: పక్షి ప్రేమికుల స్వర్గధామమైన ఆటపాక పక్షుల కేంద్రం వరద నీటిలో నానుతోంది. బుడమేరు నీటి ప్రవాహంతో పోల్‌రాజ్ డ్రెయిన్ పొంగడంతో ఈ నెల ప్రారంభం నుంచి పక్షుల కేంద్రం ముంపు బారిన పడింది. ఇప్పటికీ పూర్తిగా వరద నీరు తగ్గలేదు. పక్షుల కేంద్రం ప్రారంభంలో టిక్కెట్ కౌంటర్ వరకు వరద నీరు చేరింది. కేంద్రం లోపల పక్షి నమూనా మ్యూజియం, చిల్డ్రన్ పార్కు నీటిలోనే ఉన్నాయి. వరద తగ్గుముఖం పట్టడంతో ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు కేంద్ర వద్దకు వస్తున్నారు. నీరు తగ్గకపోవడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. విదేశీ పెలికాన్(గూడబాతు) పక్షి ఆటపాక పక్షుల కేంద్రానికి ప్రత్యేక ఆకర్షణ. వేల సంఖ్యలో పెలికాన్‌లు రావడంతో ఈ కేంద్రానికి పెలికాన్ ప్యారడైజ్‌గా పిలుస్తారు. అటవీశాఖ విదేశీ, స్వదేశీ పక్షుల విహారం కోసం ఇక్కడ 284 ఎకరాల విస్తీర్ణంలో పక్షుల విహార చెరువును ఏర్పాటు చేసింది. పక్షుల సంతానోత్పత్తి, నివాసం కోసం అటవీశాఖ 150 కృత్రిమ ఇనుప స్టాండ్లు నెలకొల్పింది. ఏటా అక్టోబరు నుంచి మార్చి వరకు విదేశీ పక్షులు లక్షల్లో కొల్లేరుకు వలస వస్తాయి. ఈ చెరువులో బోటు షికారు చూస్తూ పెలికాన్ పక్షులను దగ్గర నుంచి తిలకించడం జీవితంలో మధురమైన ఘట్టంగా మిగిలిపోతుంది.

ఆటపాక పక్షుల కేంద్రంలో పెలికాన్, పెయింటెడ్ స్టార్క్, గ్రేహెరాన్, స్టిల్ట్ వంటి అనేక జాతుల పక్షులు విహరిస్తాయి. చేపలు వీటికి ఆహారంగా మారుతాయి. పక్షుల కేంద్రం చెరువు గట్టును ఆనుకుని ప్రవహిస్తున్నా పోల్‌రాజ్ డ్రెయిన్ వరదల కారణంగా పొంగడంతో మొత్తం పక్షుల కేంద్రం చెరువు గట్లపై నుంచి వరద నీరు ప్రవహించింది. దీంతో పక్షుల కేంద్రం చెరువులో వీటికి ఆహారమైన చేపలు కొల్లేరు పాలయ్యాయి. సాధారణ పరిస్థితులో పక్షుల కేంద్రం చెరువులో 3 అడుగుల నీరు నిల్వ ఉంటుంది. వరదల కారణంగా ఇప్పుడు 10 అడుగులపైనే నీరు ఉంది. ముంపు నీటిలో 22 రోజులుగా నానుతుండటం వల్ల చెరువు గట్ల పటిష్టత దెబ్బతింది.


ఆటపాక పక్షుల కేంద్రం గట్లపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు


మంత్రి పవన్ కల్యాణ్ దృష్టి సారించేనా?

ఎన్నికల ప్రచారంలో భాగంగా కైకలూరు తాలూకా సెంటర్‌లో మే 5న విజయభేరి ప్రచార సభకు ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విచ్చేశారు. ఒడిశా మాదిరిగా మన ప్రాంతంలో పక్షుల కేంద్రాలను అభివృద్ధి చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. జనసేన నుంచి పర్యాటకశాఖ మంత్రిగా కందుల దుర్గేష్ ఉన్నారు. ఇప్పటికే ఆయన పలు ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన ఆటపాక పక్షుల కేంద్ర సమస్యలపై పవన్ కల్యాణ్, దుర్గేష్ దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

గట్లను పటిష్టం చేయాలి

ఆటపాక పక్షుల కేంద్రం చెరువు గట్లను పటిష్టం చేయాలని అనేక సంవత్సరాలుగా స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఏటా భారీ వర్షాలు కురిసినప్పుడు గట్లు తెగి నీరు పోతుంది. నీరు లేని సమయంలో మోటార్లతో నీరు పెట్టినప్పుడు గట్లు బలహీనంగా ఉండటంతో ఎక్కువ నీరు నింపలేకపోతున్నారు. అటవీ శాఖ ప్రత్యేక నిధులు కేటాయించి చెరువు నాలుగు వైపుల సిమెంటుతో పెద్ద గట్లు నిర్మించాలి. వేసవిలో నీరు నింపడానికి ఆటపాక ప్రధాన కాల్వ నుంచి నేరుగా పక్షుల కేంద్రం చెరువులో నింపేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. అటవీ శాఖ ఆటపాక బీట్ ఆఫీసర్ కావడి వెంకన్న మాట్లాడుతూ మరో వారం రోజుల్లో పూర్తి స్థాయిలో ఈ కేంద్రం పర్యాటకులకు అందుబాటులోకి వస్తుందంటున్నారు.

పక్షుల కేంద్రాన్ని పరిరక్షించుకోవాలి



ఆటపాక పక్షుల కేంద్రానికి రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు ఉంది. వేసవిలో నీరు లేక పక్షుల అల్లాడిపోతున్నాయి. ఎక్కువ వర్షాలు పడితే గట్లు తెగిపోతున్నాయి. ప్రభుత్వం ఆటపాక పక్షుల కేంద్రం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి. నాలుగు దిక్కులా గట్లను పటిష్ట పర్చాలి. వేసవికి ముందే పూర్తిస్థాయిలో పక్షుల కేంద్రంలో చెరువును నీటితో నింపాలి.

– ఎల్.ఎస్.భాస్కరరావు, సామాజికసేవా కార్యకర్త, మండవల్లి

క్లుప్తంగా

తణుకు ఏడీఈగా శ్రీనివాసు బాధ్యతల స్వీకరణ

తణుకు: తణుకు విద్యుత్ శాఖ ఏడీఈగా పులమారు శ్రీనివాసు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పెదవేగి ఏడీఈగా పని చేస్తున్న శ్రీనివాసును తణుకు బదిలీ చేయగా ఇక్కడ పని చేస్తున్న సీహెచ్ రామకృష్ణను ఏలూరు హెచ్‌టీ మీటర్స్ ఏడీఈగా బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏడీఈ శ్రీనివాసును కింది స్థాయి అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఉత్సాహంగా కొనసాగుతున్న వాకర్స్ ఆటల పోటీలు



షార్ట్‌పుట్‌లో వాకర్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ వార్షికోత్సవం సందర్భంగా వాకర్స్‌చే వాకర్స్ గ్రౌండ్‌లో వివిధ ఆటల పోటీలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా మంగళవారం సైక్లింగ్, షార్ట్‌పుట్ పోటీలు నిర్వహించారు. అధ్యక్షుడు దూలం నాగరాజు నేతృత్వం వహించారు. విజేతల వివరాలను ప్రకటించారు. అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి రోజున జరిగే వార్షికోత్సవంలో విజేతలకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాగుణం అలవరచుకోవాలి



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పెంటపాడు: విద్యార్థులు సేవాగుణాన్ని అలవరచుకోవాలని పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కళాశాలలో ఎన్ఎస్ఎస్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక సేవలు చేసిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేసారు. ఈ సందర్భంగా తొలుత కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు మొక్కలు నాటారు.

ప్రతి వారం 'పొలం పిలుస్తోంది'

ఇరగవరం: వారంలో ప్రతి మంగళ, బుధవారాలు మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తామని మండల వ్యవసాయాధికారి రాఘవేంద్ర తెలిపారు. రోజుకు రెండు గ్రామాల చొప్పున పంట చేల వద్ద రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. మంగళవారం యర్రాయి చెరువు, అర్జునుడు పాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యర్రాయిచెరువు, అర్జునుడు పాలెం, సర్పంచులు టి ఉమా మహేశ్వరరావు, పోతుల గంగాధర్, వివిధ శాఖల సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రుల పోస్టర్లు ఆవిష్కరణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక కడకట్ల 31వ వార్డు రెల్లి కాలనీలో శ్రీ బాల కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా మంగళవారం ఆలయ కమిటీ సభ్యులచే ఆధ్యాత్మిక కార్యక్రమాలతో కూడిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ధనాల వెంకట్రావు, ఉపాధ్యక్షుడు తాడికొండ శ్రీనివాస్, కార్యదర్శి మాడిమి అచ్చిబాబు, జగ్గు నిరంజన్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

తణుకు టౌన్: విద్యార్థులు చదువుతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములై సమాజంపై అవగాహన కలిగి ఉండాలని తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ యూ లక్ష్మిసుందరిబాయి చెప్పారు. జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు జీ రమ్యశ్రీని కళాశాల అధ్యాపకులు సత్కరించారు.

నజీరుద్దీన్‌కు సత్కారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తెలుగు ఇండియన్ ఐడల్ విజేతగా నిలిచిన షేక్ నజీరుద్దీన్‌ను మంగళవారం స్థానిక డీఎస్ చెరువు బుద్ధాల కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పట్టణానికి చెందిన యువకుడు మంచి పాటలతో అలరించి విజేతగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. బీవీఆర్ కళాకేంద్రం, అవ్వస్మా, తెలుగు సాహితీ సమాఖ్య, లయన్స్ క్లబ్, చాంబర్ ఆఫ్ కామర్స్ తరుపున సభ్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల తీరుపై భగ్గుమన్న దళిత వర్గాలు

- తణుకులో రాస్తారోకోలు, నిరసనలు తెలిపిన వైనం
- పోలీసుల నిర్బంధాలు, గృహ అరెస్టులు



తణుకు రాష్ట్రపతి రోడ్డులో రాస్తారోకో చేస్తున్న న్యాయవాదులు (ఫైల్)



తణుకులో పోలీసుల సమక్షంలో గృహ నిర్బంధంలో ఉన్న న్యాయవాది పొట్ల సురేష్ (ఫైల్)

తణుకు అర్బన్: కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యేలు ప్రవర్తించిన తీరుతో దళితవర్గాలు రాష్ట్రవ్యాప్తంగా భగ్గుమన్నాయి. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఫ్లెక్సీని ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు స్వయంగా తొలగించి రాజ్యాంగాన్ని అవమానపరిచారని, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ విధుల్లో ఉన్న వైద్యుడిపై తన అనుచరగణంతో దాడికి దిగడం అంతా వ్యూహాత్మకంగానే జరుగుతున్నాయా అనే అనుమానం వస్తుందని దళిత వర్గాలు ఆరోపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ దళితులపై ఈ తరహా దాడులు జరగలేదని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే ఈ ఘటనలు చూడాల్సి వస్తుందని వాపోతున్నారు. ఒక శాసనసభ్యుడు విధుల్లో ఉన్న వైద్యాధికారి ముఖంపై ఉన్న మాస్క్ లాగేసి అనుచరులతో దాడిచేయించడం ఎంతవరకు సబబని నిలదీస్తున్నారు. తణుకులో దళితవర్గాలు, న్యాయవాదులు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపి రాస్తారోకోలు నిర్వహించారు.

కూటమి ప్రభుత్వం మాట్లాడదే..

తమ ఆరాధ్యదైవం, ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన ఘటన ఉండిలో జరగగా, కాకినాడలో దళిత వర్గానికి చెందిన వైద్యాధికారిపై దాడికి దిగడాన్ని రాష్ట్ర వ్యాప్తంగా దళిత వర్గాలు, న్యాయవాదులు రోడ్లపైకి వచ్చి నిరసనలు, రాస్తారోకోలు చేస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కానీ మాట్లాడరే అంటూ దళిత వర్గాలు విమర్శిస్తున్నారు. ఇప్పటివరకు దళితుల్లో కింది స్థాయి వారిపై మాత్రమే దాడులు జరగడాన్ని చూశామని కానీ ఇప్పుడు తాజాగా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించడంతోపాటు ఒక వైద్యుడిపైనా దాడి చేసినా ప్రభుత్వం తరపున మాట్లాడకపోవడం దళిత వర్గాలపై కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి తెలుస్తోందని ప్రజా సంఘాలు, దళిత వర్గాలు, న్యాయవాదులు ఆరోపిస్తున్నారు.

దేశద్రోహం కేసు నమోదుచేయాలి



మా దేవుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ మేధావిగా అందరి మన్ననలు పొందారు. అటువంటి ఆయన ఫ్లెక్సీని తొలగించిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై దేశద్రోహంగా కేసు నమోదుచేయాలి. నాకు బాధకలిగి బయటకు వచ్చి నిరసన తెలిపినందుకు పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఆ తర్వాత గృహ నిర్బంధాలు చేయడం చాలా బాధాకరం. – పొట్ల సురేష్, ఆల్ ఇండియా పూలే అంబేడ్కర్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు

ఒక ఎమ్మెల్యే ఇలా చేయడం దారుణం



ఏలూరుపాడులో శాసనసభ్యులు రఘురామకృష్ణంరాజు స్వహస్తాలతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించడం చాలా బాధ కలిగించింది. చట్ట సభల ద్వారా భారత రాజ్యాంగాన్ని అమలు చేయాల్సిన శాసనసభ్యులే ఇటువంటి చర్యలకు దిగడం శోచనీయం. ఇలాంటి ఘటనలను స్ఫూర్తిగా తీసుకుని అణగారిన వర్గాలపై దాడులు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. – ఏలూరి చిట్టిమోసే, న్యాయవాది, తణుకు

దళిత వర్గాలకు మీరిచ్చిన బహుమతి ఇదేనా



దళిత వర్గానికి చెందిన ఉన్న ఒక వైద్యాధికారిపై కాకినాడ రూరల్ ఎమ్మెల్యే తన అనుచరులతో కలిసి దాడికి దిగడం దుర్మార్గం. దాడిచేసి అందరి ముందు అవమానించి సోషల్ మీడియాలో వైరల్ అయిందనే ఉద్దేశ్యంతో క్షమాపణ కోరడం ఎంతవరకు సబబు. కూటమి ప్రభుత్వం వచ్చిన 100 రోజులకు దళిత వర్గాలకు ఇచ్చిన బహుమతి ఇదేనన్నమాట. – పెనుమాల రాజేష్ కుమార్, తణుకు

ఆరోగ్యవంతమైన భారత్ అవసరం



నిట్ ఆవరణలో మొక్కలు నాటుతున్న రిజిస్ట్రార్ దినేష్‌రెడ్డి

తాడేపల్లిగూడెం: ఆరోగ్యవంతమైన భారత్ అవసరమని నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి కోరారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం నిట్‌లో ఏర్పాటు చేసిన మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించడంతో పాటు , పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యార్థులు చెత్తా చెదారం, వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా చెత్త బుట్టలలోనే వేయాలన్నారు. ఏపీ నిట్ ప్రాంగణాన్ని పరిశుభ్రమైన విద్యాలయంగా మార్చడానికి ప్రతి విద్యార్థి తమ వంతు బాధ్యతను తీసుకోవాలన్నారు. నిట్ ప్రాంగణం మొత్తాన్ని విద్యార్థులతో కలిసి శుభ్రం చేసి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీన్‌లు కురుమయ్య, వీరేష్‌కుమార్, అసోసియేట్ డీన్‌లు కిరణ్ తీపర్తి, వి.సందీప్, ఆచార్యులు సునీల్,ర ధర్మతేజ, శ్రీనివాసు, సంధ్యారాణిలు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే క్రీడలపై పట్టు సాధించాలి



తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న డీవైఈవో మురళి సత్యనారాయణ



తణుకులో జిల్లాస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన క్రీడాకారులతో వ్యాయామ ఉపాధ్యాయులు

డీవైఈవో మురళి సత్యనారాయణ

తణుకు అర్బన్: విద్యార్థి దశలో చక్కని విద్య, క్రీడలపై పట్టు సాధించే విద్యార్థులకు భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని డీవైఈవో డి.మురళి సత్యనారాయణ అన్నారు. స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి క్రీడాపోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు శారీరకంగా, మానసికంగాను ధృడంగా తయారుచేస్తాయని అన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని మంచి క్రీడాకారులుగా గుర్తింపు పొంది ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. నియోజకవర్గ స్థాయిలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, యోగ క్రీడల్లో నిర్వహించిన పోటీల్లో తణుకు మునిసిపాలిటీతోపాటు తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు చెందిన 380 మంది విద్యార్థులు హాజరుకాగా వివిధ పోటీల్లో 80 మంది క్రీడాకారులు విజేతలుగా నిలిచి జిల్లాస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు నియోజకవర్గ కోఆర్డినేటర్ సంకు సూర్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.పద్మావతి, వ్యాయామ ఉపాధ్యాయులు బి.జాన్సన్, టి.వినోద, ఎం.నాగరాజ్యం, వై.సోమయాజులు, కె.సుబ్బారావు, జి.రవి, ఎస్.అప్పారావు, కె.శ్రీనివాస్, పి.జయమ్మ, కె.బాబూరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి



మంచిలిలో గర్భిణులకు సామూహిక సీమంతాలు వేడుకలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే

అత్తిలి: జిల్లాలో నిరంతర అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం అత్తిలి మండలం మంచిలి గ్రామంలో ఇదిమంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటన చేయాలని, వారికి ఒక రోల్‌మోడల్‌గా నిలుస్తూ తాను మారుమూల మండలాల్లో క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తున్నానన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో సమస్యలు తమ దృష్టికి వస్తున్నాయని, మండలస్థాయి సమస్యలు మండల స్థాయిలో పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సామూహిక సీమంతాలు ....

జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వేదిక ముందు వరుసలో గర్భిణులకు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతులు మీదుగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. పౌష్టికాహార కిట్లను అందజేసారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వాలంటే పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ, తాడేపల్లిగూడెం ఆర్డీవో బి శివన్నారాయణ, తహసీల్దార్ దసిక వంశీ, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ డి మహేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ బి సుజాతరాణి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి మురళీకృష్ణ, సర్పంచ్ చింతారామయ్య, ఎంపీటీసీ దారం శిరీషా, ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే మంచిలి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పేదలకు అందించే వైద్యంలో లోపాలను ఎట్టి పరిస్థితిల్లో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మళ్లీ ఇదే విధమైన ఫిర్యాదులు అందితే తప్పకుండా చర్యలు ఉంటాయని తెలిపారు. వైద్యులు, సహాయ సిబ్బంది కలిసికట్టుగా ప్రజలకు మంచి వైద్యసేవలు అందించాలని హితవు పలికారు.

పడాలలో 'పొలం పిలుస్తోంది'



తాడేపల్లిగూడెం రూరల్: పడాల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్:మండలంలోని పడాల గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ చిరంజీవి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటించడం ద్వారా ప్రకృతి విపత్తులు, నష్టాలను నుంచి గట్టెక్కవచ్చన్నారు. ప్రతి రైతు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులను సాధించేలా యాంత్రీకరణపై దృష్టి సారించాలన్నారు. రైతులు కొత్త ధనరాజు, కామిశెట్టి శ్రీనివాస్, పిచ్చికల రామకృష్ణ, పచ్చా రామకృష్ణ, తన్నీడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అప్పారావుపేటలో...:

మండలంలోని అప్పారావుపేట గ్రామంలో బుధవారం ఉదయం 10 గంటలకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ తెలిపారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సీహెచ్.నాగరాణి ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, మండల అధికారులు హాజరు కావాలని కోరారు.

దర్శిపర్రులో...

పెంటపాడు: మండలంలోని దర్శిపర్రు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ఏడీఏ పి. మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంగళవారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడారు. రైతులు ఈ పంట నమోదు తప్పక చేయించుకోవాలన్నారు. గ్రామ సర్పంచ్ కోలా శేష వేణి, ఉపసర్పంచ్ కోలా మార్కండేయులు , వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బి.హరికుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): విశ్రాంత ఉద్యోగులకు 2018 నుంచి ఇవ్వాల్సిన డీఏ, డీఆర్, పీఆర్‌సీ బకాయిలను వెంటనే చెల్లించాలని, కొత్త పీఆర్‌సీ వచ్చేలోపు 30 శాతం ఇంటరీయమ్ రిలీఫ్ చెల్లించాలని, కోంటమ్ పెన్షన్ పునర్ధురణ చేయాలని విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు బి.హరికుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెద్ద మనస్సుతో ఆలోచన చేయాలని, తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.బాలకృష్ణ, వైవీ సత్యనారాయణ మూర్తి, గరికపాటి సుబ్రహ్మణ్య శర్మ, ముస్తాఫా, వీకే వీరారావు, ఎం.అర్జునరావు, సూరెడ్డి, సత్యనారాయణ రాజు, కృష్ణకుమారి, మూర్తి, జయరాజు, వెకంటేశ్వర్లు, ప్రసాద్‌రాజు, పాపారావు, రామలక్ష్మి, తాతారెడ్డి, రామ్మోహన్‌రావు, పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం



తణుకులో పదో తరగతి విద్యార్థులకు విజయీభవ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: ఉత్తమ సమాజ నిర్మాణమే ధ్యేయంగా విద్యారంగం అభివృద్ధికి మానవత సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని తణుకు డీవైఈవో డీ మురళీ సత్యనారాయణ చెప్పారు. మంగళవారం తణుకు రోటరీ క్లబ్ ఆడిటోరియంలో మానవత కేరీర్ గైడెన్స్ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల కోసం తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను ×విజయీభవ॥ పేరుతో కరపత్రాన్ని ఆవిష్కరించారు. తణుకు మానవత సంస్థ అధ్యక్షురాలు కఠారి శారదాదేవి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఈవో మాట్లడతూ మానవత సంస్థ పదో తరగతి విద్యార్థుల కోసం తయారు చేసిన విజయీభవ స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మానవత రాష్ట్ర కేరీర్ గైడెన్స్ సెల్ చైర్మన్ డా. కోడూరి రాధాపుష్పావతి మాట్లాడుతూ చదువుకునే పిల్లలకు అవసరమైన గైడెన్స్ ఇవ్వడంలో నిపుణులైన వారిని ఎంపిక చేసి వారితో జిల్లాలోని వివిధ పాఠశాలల్లో వివిధ అంశాలపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, జిల్లా కన్వీనర్ ఎస్‌వీ సతీష్ బాబు, మండల కన్వీనర్ ఆనందం మస్తాన్‌రావు, కార్యదర్శి బొల్లాం రామకాశీ, కోశాధికారి అక్కిన కాశీవిశ్వనాథం, ఉపాధ్యక్షుడు కె రాజరాజేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

తణుకు: పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పీవీ ప్రతాప్ అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అమర వీరుల భవనంలో సీపీఎం పట్టణ కమిటీ సమావేశం కె.నాగరత్నం అధ్యక్షతన జరిగింది. సమావేశం అనంతరం చర్చించిన అంశాలపై ప్రతాప్ మాట్లాడుతూ పట్టణంలో జనావాసాల్లో బార్ షాపులు తొలగించాలని, పట్టణంలో ప్రజలకు ప్రమాదంగా తయారైన కుక్కలు, పశువులను నియంత్రించాలని కోరారు. పెరుగుతున్న కూరగాయలు, బియ్యం, వంట నూనె, నిత్యావసర ధరలు పేదలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రేషన్ ద్వారా అన్ని రకాల సరుకులు అందించాలని, గోస్తని కాలుష్యం నివారణకు చర్యలు చేపట్టాలని సీపీఎం పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. తొలుత ఇటీవల మృతి చెందిన సీపీఎం ఆల్ ఇండియా ప్రధాన కామ్రేడ్ సీతారాం ఏచూరి, సీపీఎం మాజీ జిల్లా కార్యదర్శి రుద్రరాజు సత్యనారాయణరాజులకు సంతాపం తెలియజేశారు. ఈ సమావేశంలో గార రంగారావు, అడ్డగర్ల అజయకుమారి, గుబ్బల గోపి, పీడీ మూర్తి, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

వరిపైరులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో రాజేష్

అత్తిలి: వరిపైరులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి మంచి దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. మంగళవారం పాలి, అత్తిలి శివారు బొంతువారిపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు హాజరై రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రతి మంగళ, బుధవారాల్లో ప్రతి రోజు రెండు గ్రామాల్లో నిర్వహించడం జరుగుతుందని ఏఓ తెలిపారు. బుధవారం ఉరదాళ్లపాలెం, గుమ్మంపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీ నరశింహారావు, ఫిషరీస్ అసిస్టెంట్ నరేంద్ర, వీఏఏ శిరీషా, మోహన్, భాను, ప్రసాద్, సౌమ్య, తెదేపా మండల అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ, పూతినీడి శ్రీనివాస్, అల్తి సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ

పెంటపాడు: ప్రజారోగ్యం పట్ల గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు గ్రామ కార్యదర్శి కె.నాగరాజు పేర్కొన్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా, స్వచ్ఛమైన తాగునీరు అందించే కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన గ్రామంలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న పనులను పరిశీలించారు. తాగునీటి శుభ్రత కోసం పద్మావతి కాలనీ సమీపంలో ఉన్న చమటచెర్వు ఓహెచ్‌ఆర్ వద్ద క్లోరినైజేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనంతరం జ్వరాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో అంజిబాబు, ఏఎన్ఎం అన్నపూర్ణ, ఆరోగ్యశాఖ కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

తాడేపల్లిగూడెం: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మునిసిపల్ కమిషనర్ మురళీకృష్ణ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మునిసిపాలిటీ, శశి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సంయుక్తంగా బస్టాండ్ పరిసరాలను శుభ్రం చేశారు. కమిషనర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించడానికి కృషి చేయాలన్నారు. డిపో మేనేజర్ మూర్తి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అన్నారు. పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కోసం విద్యార్థులతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శశి ప్రిన్సిపాల్ ఇస్మాయిల్ అన్నారు. శశి సంస్థల అధినేతలు బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, మేకా నరేంద్రకృష్ణలు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సల్మాన్ భాషా, టి.సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు.

ప్రజలు ఆరోగ్య నియమాలు పాటించాలి



మాధవరం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలు ఆరోగ్య నియమాలు పాటించాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. మంగళవారం మండలంలోని మోదుగ గుంట, మాధవరం గ్రామాల్లో డ్రైడే కార్యక్రమంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ డ్రైడే పాటిస్తే దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చన్నారు. కీటక జనీత వ్యాధులను అరికట్టే క్రమంలో క్షేత్ర స్థాయిలో తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వరరావు, ఆరోగ్య పర్యవేక్షకులు మణి, ఆరోగ్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాలు, ఆరోగ్య సహాయకులు హరినాథ్ బాబు, ఏలూరి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

రఘురామ తీరుకు నిరసన



నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న పీపుల్స్ వాయిస్ ఆఫ్ అంబేడ్కర్ యూత్ కమిటీ సభ్యులు

తాడేపల్లిగూడెం రూరల్: ఏలేరుపాడు గ్రామంలో అంబేడ్కర్ ఫ్లెక్సీలను ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు తొలగించడం పట్ల మంగళవారం మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో పీపుల్స్ వాయిస్ ఆఫ్ అంబేడ్కర్ యూత్ కమిటీ సభ్యులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. మానుకొండ వరద రాధాకృష్ణరాజు, సీహెచ్. మహేష్, ఎస్.వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగులను ఆదరించాలని ట్రిగోన్ అధ్యక్షుడు డాక్టర్ నార్ని భవాజీ తెలిపారు. ట్రిగోన్ సంస్థ, నార్ని డాక్టర్ రత్నాలయ కుమారి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని సుబ్బారావుపేట భవిత సెంటర్‌లో అంతర్జాతీయ బధిరుల దినోత్సవ వారోత్సవాలు సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లల్లో దాగిఉన్న ప్రతిభను గుర్తించడానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. దివ్యాంగుల పిల్లలను నార్మల్ పిల్లలతో సమానంగా చూడాలని, వైకల్యం అధిగమించి దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణిస్తారని చెప్పారు. ప్రత్యేక ఉపాధ్యాయ్యులు ఎస్‌కే బాలీశ్వరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి కుమారి

పెంటపాడు: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి కె. కుమారి పేర్కొన్నారు. మంగళవారం పెంటపాడు మండల సమావేశ మందిరంలో కార్యదర్శులు, మండల సిబ్బందికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామం ప్రగతిలో ముందుండేలా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. హౌసింగ్, విద్య, సామూహిక అభివృద్ధి, తదితర రంగాలలో పూర్తి ప్రాధాన్యత సాధించేలా మండల సిబ్బంది టీంలు కృషి చేయాలన్నారు.